క్లుప్తంగా

డ్రైనేజీలపై ఆక్రమణలు ఉంటే చర్యలు

కమిషనర్ జి.రఘునాథరెడ్డి



బాపట్ల: పట్టణంలోని డ్రైనేజీలపై ఆక్రమణలు ఉంటే వెంటనే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని సూర్యలంక రోడ్డులోని ఆక్రమణలను తొలగించే పనులు చేపట్టారు. డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టడంతోపాటు ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని కొనసాగించారు. డ్రైనేజీల వెంటనే షాపులు ఏర్పాటు చేయరాదని సూచించారు. కమిషనర్‌తో పాటు టౌన్ ప్లానింగ్ అధికారి ఎస్.మల్లిఖార్జునరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ కరుణ, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామాలలో పొలం పిలుస్తోంది

కర్లపాలెం: మండల పరిధిలోని కర్లపాలెం, బుద్దాం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తామని మండల వ్యవసాయశాఖాధికారి సుమంత్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొని తమ సందేహాలకు వ్యవసాయాధికారుల నుంచి సలహాలు సూచనలు అడిగి తెలుసుకోవచ్చునని చెప్పారు.

రాజస్థాన్ యువకుడు బాపట్లలో మృతి



మృతుడు కేశారామ్

బాపట్లటౌన్: రాజస్థాన్‌కు చెందిన యువకుడు బాపట్లలో మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. రాజస్థాన్‌కు చెందిన కేశారామ్ (22) గత రెండు సంవత్సరాల నుంచి బాపట్లలోని స్టేట్ బ్యాంక్ సమీపంలోని సెల్ పాయింట్‌లో పనిచేస్తున్నారు. సోమవారం సూర్యలంక రోడ్డులోని నివాసం ఉండే గృహంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతికి గల కారణాలు తెలియలేదు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.

సావిత్రీబాయి పూలే గ్రంథావిష్కరణ



పొన్నూరు: పట్టణంలోని లుంబినీవనం అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో కవి డాక్టర్ కత్తి పద్మారావు తల్లి 29వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండే నాగేశ్వరరావు, దేవరపల్లి రవికుమార్, మాతంగి పెద్దబ్బాయి, కర్ర అంబేడ్కర్ పాల్గొని కత్తి పద్మారావు రచించిన సావిత్రీబాయి పూలే గ్రంథాన్ని ఆవిష్కరించారు. సావిత్రీబాయి పూలే జీవితం ప్రపంచానికే ఆదర్శనీయమైందని పద్మారావు అన్నారు. మండే నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచంలో ఒక ఉద్యమాన్ని ఒకే స్ఫూర్తి, దీక్షతో పోరాటం నడిపిన గొప్ప వ్యక్తులు మహాత్మా పూలే, సావిత్రీబాయి పూలే అని కొనియాడారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని సావిత్రీబాయి పూలే గ్రంథావిష్కరణ సదస్సు జరుగుతుందని పద్మారావు తెలిపారు. కార్యక్రమంలో గేరా ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

పీఎస్ మండల శాఖ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

చేబ్రోలు: చేబ్రోలు మండల పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ మండలశాఖ అధ్యక్షుడుగా జి.శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడుగా జి.శ్రీనివాసరావు(సుద్దపల్లి పీఎస్), ప్రధాన కార్యదర్శిగా బి.ప్రశాంతి(శేకూరు పీఎస్)తో మరి కొంతమందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీడీ ప్రసాద్ సూచనల మేరకు జరిగిన సమావేశంలో పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారం కోసం సంఘ సభ్యులు కలిసి కృషి చేయనున్నట్లు తెలిపారు.

వాహనాల తనిఖీలు

పెదకాకాని: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 40 మందికి సోమవారం అపరాధ రుసుం విధించినట్లు సీఐ టి.పి.నారాయణ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు పెదకాకానిలో వాహనాల తనిఖీలు నిర్వహించామని, ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా, హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడుపుతున్న 40 మందికి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు అపరాధ రుసుం విధించామని తెలిపారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్ ధరించాలని, ట్రిబుల్ రైడ్, మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు.

సచివాలయ భవనాలకు గ్రహణం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రజలకు గ్రామాలలోనే సేవలు అందించింది. సచివాలయ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు ప్రారంభించింది. కొన్ని భవనాల నిర్మాణాలు పూర్తి కాగా కొన్ని సార్వత్రిక ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సచివాలయ భవనాల నిర్మాణంపై దృష్టి సారించక పోవడంతో సచివాలయాలకు గ్రహణం పట్టింది.

- నిలిచిపోయిన నిర్మాణాలు
- మంజూరు కాని నిధులు
- అద్దె భవనాల్లో అవస్థలు



వరహాపురం గ్రామంలో నిర్మాణం నిలిచిపోయిన గ్రామ సచివాలయ భవనం

వరహాపురం(వేమూరు): ప్రభుత్వం గ్రామ సచివాలయ భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయకపోవడంతో నిర్మాణం నిలిచి పోయింది. గ్రామ సచివాలయం లేక గ్రామస్తులు అనేక అవస్థలు పడుతున్నారు. వేమూరు మండలంలోని వరహాపురం గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. గత ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకు వచ్చింది. మండలంలో మొత్తం 14 సచివాలయాలను మంజూరు చేయగా, ఒక్కో సచివాలయం నిర్మాణం కోసం రూ.30 లక్షలు చొప్పున మంజూరు చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడటంతో నిర్మాణం నిలిపి వేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ సచివాలయం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయలేదని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో మండలంలోని కుచ్చెళ్లపాడు, జంపని, పెరవలిపాలెం, వరహాపురం, చదలవాడ గ్రామాల్లో గ్రామ సచివాలయ భవనాలు నిర్మాణం పూర్తిగా నిలిచి పోవడం జరిగిందని గ్రామస్తులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం గ్రామ సచివాలయాలకు నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామ సచివాలయాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో ప్రభుత్వ సేవలు పొందడం కష్టంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నిలిచి పోయిన గ్రామ సచివాలయాలకు నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

అద్దె భవనాల్లో సేవలు

గ్రామ పంచాయతీ కార్యాలయాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో గత ప్రభుత్వం గ్రామ సచివాలయ భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసింది. నిధులతో భవనాల నిర్మాణ పనులు చేశారు. గ్రామ సచివాలయాలకు భవనాలు లేని గ్రామాల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కుచ్చెళ్లపాడు గ్రామంలో శిథిలావస్థకు చేరిన గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజలకు సేవలు అందిస్తున్నారు. జంపని గ్రామంలో అద్దె భవనంలో, పెరవలి పాలెంలో అద్దె భవనం, చదలవాడలో శిథిలావస్థకు చేరిన భవనాల్లో గ్రామ సచివాలయ సిబ్బంది ప్రజలకు సేవలు అందించడం జరుగుతుంది. ప్రభుత్వం వెంటనే నిలిచిపోయిన గ్రామ సచివాలయ భవనాలకు నిధులు మంజూరు చేయాలని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు. అద్దె భవనాల్లో ప్రజలు నిలబడేందుకు కూడా ఖాళీ లేక నానా అవస్థలు పడుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



వరహాపురం గ్రామంలో గ్రామ సచివాలయం నిధులు లేక నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 9 నెలలు అవుతున్నా ఇంత వరకు నిధులు మంజూరు చేయలేదు. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలి.

– యల్లమాటి మధు, వరహాపురం

అద్దె భవనాల్లో అవస్థలు



గ్రామ సచివాలయాలు అద్దె భవనాల్లో కొనసాగించడం వల్ల ప్రభుత్వ సేవల కోసం నానా అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి వెంటనే భవన నిర్మాణం పనులు చేపట్టాలి.

– యల్లమాటి చంటి, వరహాపురం

పూర్తి చేస్తే నిధులు వస్తాయి

సచివాలయ భవన నిర్మాణ పనులు పొందిన వారు నిర్మాణం పూర్తి చేస్తే నిధులు వస్తాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో సిమెంట్ రోడ్లు వేశారు. ఇంత వరకు ఆ నిధులు కూడా మంజూరు చేయలేదు.

– సత్యకృష్ణ, ఏపీవో, వేమూరు

బ్రహ్మారెడ్డి మృతి దురదృష్టకరం

డాక్టర్ ఈవూరు గణేష్



చెరుకుపల్లి: రోడ్డు ప్రమాదంలో పిట్టు బ్రహ్మారెడ్డి మృతి చెందటం దురదృష్టకరమని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. మండల పరిధిలోని పొన్నపల్లి గ్రామానికి చెందిన పిట్టు బ్రహ్మారెడ్డి ప్రమాదంశాత్తూ ఆదివారం రోడ్డు ప్రమాంలో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న డాక్టర్ గణేష్ బ్రహ్మారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు, అనంతరం బ్రహ్మారెడ్డి కుటుంబ సభ్యులను ఓదారుస్తూ పార్టీ అండగా ఉంటుందని అధైర్యపడవద్దని భరోసా కల్పించారు. గణేష్ వెంట మండల పార్టీ కన్వీనర్ దుండి వెంకటరామి రెడ్డి, గ్రామంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఇంటర్ పరీక్షలకు 1,289 మంది హాజరు

రేపల్లె రూరల్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెలుగు పరీక్షకు 1,326 మంది హాజరుకావాల్సి ఉండగా 1,289 హాజరై, 37 మంది గైర్హాజరయ్యారు. ఆర్‌సీ జూనియర్ కళాశాలలో 417 మందికి 8 మంది, జేఎల్‌బీ కళాశాలలో 319 మందికి 9 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 305 మందికి 9 మంది, చైతన్య కళాశాల సెంటర్‌లో 285 మందికి 11 మంది గైర్హాజరైనట్లు ఆయా కళాశాలల చీఫ్ సూపరింటెండెంట్‌లు తెలిపారు.

ఇంటర్ దూర విద్య పరీక్ష కేంద్రాల పరిశీలన

రేపల్లె రూరల్: పట్టణంలో జరుగుతున్న ఇంటర్ దూర విద్య పరీక్ష కేంద్రాలను విద్యా శాఖ ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి సోమవారం పరిశీలించారు. పట్టణంలోని ట్రిబుల్ ఎస్ హైస్కూలు, గవర్నమెంట్ హైస్కూలు, మున్సిపల్ హైస్కూలు, పేటేరు జెడ్పీహైస్కూలు, మాంట్‌ఫోర్ట్ స్కూలులో పరీక్ష కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే ఇన్విజిలేటర్‌లతో పాటు విద్యార్థులపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఈవో కేసనశెట్టి సురేష్ ఉన్నారు.

ఇంటర్ పరీక్షకు పది మంది విద్యార్థులు గైర్హాజరు



చెరుకుపల్లి: ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు సీఎస్‌లు హరికృష్ణ, బాబురావు, భారతి తెలిపారు. మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్ష రాశారు. ఇందులో కావూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 237 మందికి గాను ఆరుగురు, ఎస్ఆర్‌ఐ కళాశాలలో 118 మందికి గాను నలుగురు, అదేవిధంగా గీతం కళాశాలలో 202 మంది పూర్తిగా హాజరయ్యారని తెలిపారు.

బాల్య వివాహాలతో అన్నీ అనర్థాలే

సీడీపీవో సుచరిత



సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించిన సీడీపీవో సుచరిత

రేపల్లె రూరల్: బాల్య వివాహాలతో అన్నీ అనర్థాలేనని సీడీపీవో ఎం.సుచరిత చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాలలో భాగంగా రేపల్లె ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిరోధానికై పట్టణ ప్రజల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. వివాహానికి మహిళలకు 18 సంవత్సరాలు, పురుషులకు 21 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. చిన్న వయస్సులోనే బాలికలు వివాహం చేసుకోవటంతో ఆరోగ్యం, గృహ నిర్వహణ పరంగా ఇబ్బందులు ఎదుర్కొనాల్సిన పరిస్థితులు ఉంటాయన్నారు. మానసిక పరిపక్వత కలగక సంఘర్షణకు లోనవుతారన్నారు. బాలికలు గర్భం దాల్చితే తల్లీ బిడ్డలిద్దరూ ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎవరైనా తమ పరిధిలో బాల్య వివాహాలు జరుగుతుంటే అధికారులకు సమాచారం అందించి బాల్య వివాహాల నిరోధానికి కృషి చేయాలని చెప్పారు. అనంతరం బాల్య వివాహాల నిరోధంలో తాము సైతం భాగస్వాములమవుతామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అంగన్‌వాడీలు కొవ్వొత్తులతో ర్యాలీ ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి



మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతిని సన్మానించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

కర్లపాలెం: ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ బాపట్ల సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి చెప్పారు. వైఎస్సార్‌సీపీలో బాపట్ల నియోజకవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన షేక్ జాకీర్ హుస్సేన్, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన ఆట్ల నాగేశ్వరరెడ్డి సోమవారం పార్టీ నాయకులతో కలసి వెళ్లి మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతిని ఆయన స్వగృహంలో కలిశారు. తమపై నమ్మకముంచి నియోజకవర్గ బాధ్యతలు అప్పగించినందుకు కోన రఘుపతికి శాలువా, పూలమాలలతో చిరు సన్మానం చేశారు. ఈ సందర్భంగా కోన రఘుపతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చి ఇప్పుడు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని తెలిపారు. మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, రైతు విభాగం అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డిలు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఎంపీటీసీ సభ్యుడు షేక్ ఆసిఫ్ అలీ, నాయకులు ఇమామ్, షంషీర్, మనోహర్, జానీ, కరిముల్లా, పర్వేజ్ తదితరులు ఉన్నారు.

బాలికలను తప్పనిసరిగా చదివించాలి



మహిళలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి

ప్రత్తిపాడు: తల్లిదండ్రులు తప్పనిసరిగా బాలికలను చదివించాలని ఐసీడీఎస్ గొట్టిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ పి.మాధవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాలలో భాగంగా ప్రత్తిపాడు సెక్టార్‌లోని ప్రత్తిపాడు కుమ్మరిపాలెం అంగన్‌వాడీ కేంద్రం, గొట్టిపాడు సెక్టార్‌లోని వెంకటేశ్వరనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు, తల్లులతో బాల్య వివాహాల నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. ఆయా సెక్టార్‌ల సూపర్‌వైజర్లు ఎస్.భారతి, పి.మాధవి మాట్లాడుతూ సూపర్‌వైజర్లు మాట్లాడుతూ బాల్యవివాహాల వలన అనేక అనర్థాలు ఎదురవుతాయని చెప్పారు. బాల్యవివాహం చేసుకున్నా, ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమన్నారు. బాల్యవివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రతి ఒక్కరం ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకాయమ్మ, కుసుమ పాల్గొన్నారు.

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న ఎస్ఐ తిరుపతిరావు



జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఎస్సై రవికృష్ణ

నిజాంపట్నం: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు నిజాంపట్నం పోలీసు విభాగం ఆధ్వర్యంలో ఎస్ఐ కె.తిరుపతిరావు పర్యవేక్షణలో ఆక్స్‌ఫర్డ్ స్కూలులో విద్యార్థినులకు సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎస్ఐ తిరుపతిరావు మాట్లాడుతూ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా విద్యార్థినులకు లింగ సమానత్వాన్ని ప్రోత్సహించటంలో పురుషుల ఆవశ్యకత అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేయబడునని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జంపని(వేమూరు): వ్యాస రచన పోటీల వల్ల విద్యార్థినులు మంచి జ్ఞానం పొందడం జరుగుతుందని ఎస్సై రవికృష్ణ తెలిపారు. వేమూరు మండలంలోని జంపని గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు వ్యాస రచన పోటీలు సోమవారం నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మహిళ కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

భట్టిప్రోలు (కొల్లూరు): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా తక్షణం పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బండారు శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం భట్టిప్రోలులోని ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడిచిపోయినప్పటికీ సంక్షేమ బోర్డును ప్రకటించక పోవడం బాధాకరమన్నారు. తక్షణం కూటమి ప్రభుత్వం సంక్షేమ బోర్డును ప్రారంభించి పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు నిండిన భవన నిర్మాణ కార్మికులకు రూ.6 వేలు చొప్పున పెన్షన్ ఇవ్వాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 28న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘం నాయకులు ఓబులశెట్టి రమేష్, విష్ణుమొలకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థిని



విద్యార్థిని అన్వితను అభినందిస్తున్న ప్రముఖులు

పెదకాకాని: జాతీయస్థాయి అబాకస్ పోటీల్లో పెదకాకానికి చెందిన విద్యార్థిని ప్రతిభ చాటింది. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల కరస్పాండెంట్ పెద్ది శ్రీనివాసరావు మాట్లాడుతూ హైదరాబాద్‌లో విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జాతీయస్థాయి అబాకస్ పోటీల్లో పెదకాకాని మండలం, తక్కెళ్లపాడు గ్రామంలో శ్రీ అనితా పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థిని బి.అన్విత అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం కై వసం చేసుకుందని తెలిపారు. ఈ సందర్భంగా అన్వితను అపుస్మా స్టేట్ ప్రెసిడెంట్ తులసి విష్ణు ప్రసాద్, ప్రముఖులు జయప్రకాష్ నారాయణ అభినందించారని పాఠశాల యాజమాన్యం పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్ వేదవతి పాల్గొన్నారు.

గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి

వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్



మాట్లాడుతున్న డాక్టర్ ఈవూరు గణేష్

చెరుకుపల్లి: రేపల్లె నియోజకవర్గంలో పార్టీలో పార్టీ పరంగా వివిధ విభాగాల్లో పదవులు పొందిన వారందరూ గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. గుళ్ళపల్లిలోని డాక్టర్ గణేష్ క్యాంపు కార్యాలయంలో సోమవారం నగరం మండలంలో వివిధ విభాగాల్లో పార్టీ పదవులు పొందిన నాయకులు, పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రజా సమస్యలను పట్టించుకోకుండా గాలికి వదిలేసి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, తప్పుడు కేసులు పెట్టడమే పనిగా పెట్టుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబు వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు ఏ ఒక్క పని చెయ్యవద్దు అంటూ చెప్పటం ఆయన నీచ రాజకీయాలను బట్టబయలు చేస్తుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదల కోసం విద్య, వైద్యంతోపాటు సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందించారని కానీ నేటి కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు సంక్షేమం అందించక పోవటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అదే విధంగా ఆరోగ్య శ్రీ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ కూటమి ప్రభుత్వం పైశాచిక ఆనందం పొందుతుందని విమర్శించారు. ఇక జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఎన్నికలకు ముందు ఏ ఒక్కరికి అన్యాయం జరిగినా ఎంతటి వారినైనా నిలదీసి ప్రశ్నిస్తానని, నేడు ఎక్కడా ప్రజల సమస్యలపై నోరు మెదపకుండా కాషాయం ధరించి దేశాటన చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

రాష్ట్రంలోని ప్రజలు కూటమి ప్రభుత్వంపై తొమ్మిది నెలల కాలంలోనే పూర్తిగా విసుగుచెందారని రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని గణేష్ జోస్యం చెప్పారు. అనంతరం నగరం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ ఈవూరు గణేష్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చెరుకుపల్లి మండల పార్టీ కన్వీనర్ దుండి వెంకటరామిరెడ్డి, రేపల్లె నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు పాగోలు వెంకటేశ్వరరావు, పంచాయతీల విభాగం అధ్యక్షుడు మత్తి రవికుమార్, యువజన విభాగం అధ్యక్షుడు దొంతిబోయిన ఏడుకొండల రెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు కొండేపి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నిజాంపట్నం కోటేశ్వరరావు, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి చౌటూరి రమేష్, కాశీ ప్రభాకర్, జాలాది ఇస్సాకు తదితరులు పాల్గొన్నారు.

యూరియా అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



కాకుమాను: ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తే అటువంటి దుకాణ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని పొన్నూరు ఏడీఏ వి.రామకోటేశ్వరి అన్నారు. మండల కేంద్రం కాకుమానులోని పలు ఎరువుల దుకాణాలను సోమవారం ఏడీఏ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి షాపులో ఎరువులు, పురుగు మందులకు సంబంధించి లైసెన్స్‌లు, ఫాంలు, ప్రిన్సిపాల్ సర్టిఫికెట్‌లు తప్పని సరిగా ఉండాలని ఆమె తెలిపారు. బిల్లులపై రైతుల సంతకాలను తీసుకోవాలని నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే అటువంటి షాపు యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట ఏఓ కె.కిరణ్మయి ఉన్నారు.